ఒక్క నెలలో రూ.6.03 కోట్ల బంగారం పట్టివేత

శంషాబాద్ రూరల్, మార్చి 4: విదేశాల నుంచి అక్రమంగా బంగారాన్ని తరలిస్తూ ఫిబ్రవరి పలువురు ప్రయాణికులు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పట్టుబడ్డారని, వారి వద్ద నుంచి రూ.6.03 కోట్ల విలువ జేసే బంగారం స్వాధీనం చేసుకున్నామని కస్టమ్స్ అధికారులు తెలిపారు. ఈ వివరాలను కస్టమ్స్ అధికారులు సోమవారం తెలిపారు. విదేశాల నుంచి వస్తున్న కొంత మంది ప్రయాణికులు ఎలాంటి అనుమతి లేకుండా.. అక్రమ మార్గంలో బంగారం తీసుకువస్తుంటారని, ఎయిర్‌పోర్టులో చేపట్టే తనిఖీలు పట్టుబడుతారని తెలిపారు. తనిఖీల్లో పట్టుబడకుండా ఉండేందుకు వేర్వేరు మార్గాల్లో మల ద్వారం, హర్డ్ వేర్ టూల్స్, మెర్క్యూరిటీ, కోటెడ్, బ్యాగులలో తీసుకువస్తారని పేర్కొన్నారు. ఫిబ్రవరి నెలలో అక్రమంగా బంగారం తరలిస్తున్న ప్రయాణికుల నుంచి 13.65 కిలోల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన బంగారం విలువ 6.03 కోట్లు చేస్తుందని వివరించారు. ఈ మేరకు కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు.

బైండ్ల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

వికారాబాద్, మార్చి 4 : బైండ్ల సంఘం వికారాబాద్ జిల్లా నూతన కమిటీని రాష్ట్ర బైండ్ల సంఘం ఆధ్వర్యంలో వికారాబాద్‌లో ఎన్నుకున్నారు. వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి గారాములు, ఉపాధ్యక్షులుగా నర్సింహులు, సలహాదారులుగా బిచ్చన్న, కోశాధికారిగా శీనును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర బైండ్ల సంఘం అధ్యక్షుడు రాంచందర్, ఉపాధ్యక్షులుగా రాములు కంది, ప్రధాన కార్యదర్శిగా యాదగిరి,కిష్టయ్య, కుమార్, కార్యదర్శులుగా శ్రీను, సునీల్ తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు సంగారెడ్డి, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల నుంచి బైండ్ల కుల సంఘ నాయకులు హాజరయ్యారు.

నీరుగారుతున్నా.. నిర్లక్ష్యమే!

దోమ, మార్చి 4: మండల పరిధిలోని పాలేపల్లి గ్రామంలో గత కొన్ని రోజులుగా మిషన్ భగీరథ తాగునీరు ట్యాంకు నిండి పై నుంచి వృథా గా పోతున్నది. సంబంధిత అధికారులు, ప్రత్యేక అధికారి చూసీ చూడ నట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆవే దన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి ట్యాంకు నిండిన తర్వాత ట్యాంకులోకి నీటి సరఫరాను ఆపి వేస్తే ఇతర గ్రామాలకు వెళ్తుంది. వాటర్‌మెన్, పంచాయతీ కార్య దర్శి, ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారి పట్టించుకోక పోవడంతో తాగునీరు వృథాగా పోతున్నదని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత కేసు నమోదు

బొంరాస్‌పేట, మార్చి 4: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్ రవూఫ్ తెలిపారు. మండల కేంద్రానికి సమీపంలోని ఇటుక బట్టీ సమీపంలో ఆదివారం రాత్రి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని మద్దిమ డుగుతం డాకు చెందిన డ్రైవర్ రాములుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుకడంప్‌ను సీజ్ చేసిన అధికారులు

తాండూరు రూరల్, మార్చి 4: తాండూరు మండలం, చెన్‌గేష్‌పూర్ శివారులోని సర్వే నెం.83లో అక్రమంగా డంప్ చేసిన ఇసుకను రెవెన్యూ అధికారులు సోమవారం సీజ్ చేశారు. ఆర్ఐ బాల్‌రాజ్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు ఇసుక డంప్ చేసిన స్థలాన్ని పరి శీలించారు. నజీర్ అహ్మద్, మునీజీర్ అహ్మద్‌తోపాటు మరో వ్యక్తి కలిసి ఓ కాంపౌండ్ వాల్‌లో 101 ఇసుక ట్రాక్టర్లను డంప్ చేశారు. నమ్మదగిన సమాచారం మేరకు వెళ్లి పరిశీలించి. ఇసుకను సీజ్ చేసినట్లు తెలిపారు. త్వరలోనే ఈ ఇసుకను వేలం వేస్తామని ఆయన తెలిపారు.

ధరణి సమస్యల పరిష్కారానికి కృషి

తాండూరు రూరల్, మార్చి 4: ధరణిలో పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని తాండూరు మండల తహసీల్దార్ తారాసింగ్ అన్నారు. సోమవారం కార్యాలయంలో ధరణిలో పెండింగ్ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో 504 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ నెల 9వ తేదీలోపు అన్నింటిని పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్, ఆర్ఐలు బాల్‌రాజ్, రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

సీసీ పనుల్లో నాణ్యత పాటించాలి

బషీరాబాద్, మార్చి 4: సీసీ రోడ్ల నిర్మాణపు పనుల్లో నాణ్యత పాటించాలని బషీరాబాద్ తహసీల్దార్ వెంకటేశ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని కంసాన్‌పల్లి(బి) గ్రామంలో పర్యటించి సీసీ రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత కాంట్రాక్టర్‌లతో మాట్లాడుతూ.. నాణ్యత విషయంలో రాజీ పడొద్దని, ఇసుకను అక్రమంగా తీసుకురావొద్దని సూచించారు. సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయిన తర్వాత వారం పాటు క్యూరింగ్ చేయాలని తెలిపారు. అనంతరం ధరణి ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమంలో పాల్గొని ఫిర్యాదు దారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రాకేశ్, వీఆర్ఏ శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

బషీరాబాద్, మార్చి 4 : కొబ్బరి చెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై రమేశ్ సోమవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు.. బకాశీం పూర్ గ్రామానికి చెందిన దత్తాత్రేయ (23) శనివారం గ్రామంలోని నర్సింహులు ఇంటి వద్ద ఉన్న కొబ్బరి చెట్టు ఎక్కి బొండాలు కోసే క్రమంలో ప్రమాదశాత్తు కాలు జారి కింద పడ్డాడు. గమనించిన గ్రామస్తులు వెంటనే చికిత్స నిమిత్తం తాండూరు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడి తల్లి ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వ్యక్తిపై న్యూసెన్స్ కేసు నమోదు

బషీరాబాద్, మార్చి 4 : మద్యం మత్తులో పోలీస్ స్టేషన్‌కి వచ్చి న్యూసెన్స్ సృష్టించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేశ్ సోమవారం తెలిపారు. ఠాణా పరిధిలోని ఎక్మాయి గ్రామానికి చెందిన కార్తె మంజునాథ్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి పోలీసులతో వాదనకు దిగాడు. పోలీసులు ఎంత నచ్చ చెప్పిన వినిపించుకోకపోవడంతో ఎస్సై ఆయనను పరీక్షించగా సదరు తాగి ఉన్నట్లు గమనించి న్యూసెన్స్ కేసుతో పాటు, ఐపీసీ 290 సెక్షన్ కింద కేసులు నమోదు చేశామన్నారు.

పాఠశాలలో మాక్ పోలింగ్

ధారూరు, మార్చి 4: మండల పరిధిలోని నాగసముందర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ మాక్‌పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ..ప్రత్యక్ష ఎన్నికల్లో ప్రిసైడింగ్ అధికారి, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారితో పాటు ఇతర సిబ్బంది, ఏజెంట్లు, పోలీసు సిబ్బంది తదితరులు విధులు నిర్వహిస్తారన్నారు. ఈ అంశాలతో పాటు ఓటింగ్ విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి మాక్‌పోలింగ్ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు యాదగిరి, విష్ణువర్ధన్ రెడ్డి, దామోదర్ రెడ్డి, శ్రీనివాస్, లాలయ్య, గౌరీశంకర్, అశ్రుబేగం, శ్రీనివాస్, వెంకటేశం, శాంతమ్మ, రవి, నిర్మల, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు ఉపసంహరించుకోవాలి

పరిగి, మార్చి 4: అంగన్‌వాడీ ఉద్యోగులను దొంగలుగా చిత్రీకరిస్తూ అంగన్‌వాడీ కేంద్రాలలో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ పెట్టాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఐసీడీఎస్ బలోపేతం, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు.

రెండోరోజూ పల్స్ పోలియో

■ ఇంటింటికీ వెళ్లి చిన్నారులకు చుక్కల మందు పంపిణీ ■ పర్యవేక్షించిన రాష్ట్ర పరిశీలకులు

బొంరాస్‌పేట: పల్స్ పోలియో గురించి తెలుసుకుంటున్న అధికారులు

కులకచర్ల మండల కేంద్రంలో పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకులు బద్రినాథ్

బొంరాస్‌పేట, మార్చి 4: పల్స్ పోలియో చుక్కల మందు పంపిణీ సోమవారం కూడా కొనసాగింది. ఆదివారం చుక్కల మందు వేయించని చిన్నారులకు అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి మందు వేశారు. కార్యక్రమాన్ని అధికారుల బృందం బొంరాస్‌పేటలో పరిశీలించింది. గుర్తించిన చిన్నారులందరికీ చుక్కల మందును వేశారా లేదా అని అధికారులు అడిగి తెలుసు కున్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి హేమంత్‌కుమార్ పాల్గొ న్నారు.

కులకచర్ల: మండల పరిధిలోని కులకచర్ల, బండవెల్కిచర్ల, రాంనగర్ గ్రామాల్లో నిర్వహిస్తున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని రాష్ట్ర పరిశీలకులు బద్రినాథ్ పరిశీలించారు. పిల్లలకు పోలియో చుక్కలు వేశారా లేదా అనే విషయాన్ని చిన్నారుల తల్లితండ్రులను, గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. మండలంలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన వైద్యులను, వైద్య సిబ్బందిని అభినందించారు. పల్స్ పోలియో కార్యక్రమంపై రాష్ట్ర పరిశీలకులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కులకచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ వాజిహుద్దీన్, సీహెచ్‌వో చంద్రప్రకాశ్, ఫార్మాసిస్ట్ నరేందర్, ఏఎన్ఎం జంగమ్మ, ఆశ కార్యకర్తలు సునిత, లావణ్య, విజయలక్ష్మి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

మర్పల్లి : పోలియో మహమ్మారి నుంచి చిన్నపిల్లలను కాపాడుకోవడానికి పల్స్ పోలియో చుక్కలు వేయించాలని పట్లూర్ పీహెచ్‌సీ డాక్టర్ నేహ అన్నారు. సోమవారం మండల పరిధిలోని పలు గ్రామాలను ఆమె సందర్శించి రెండో రోజు 0–5 ఏండ్ల చిన్నారులకు పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని పరిశీలించారు. చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేయించారా అని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోలియో మహమ్మారిని తరిమేద్దామన్నారు. కార్యక్రమంలో అంగన్ వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మర్పల్లి: చిన్నారికి పల్స్ పోలియో చుక్కలు వేస్తున్న డాక్టర్ నేహ

ఎల్లమ్మ జాతర హుండీ ఆదాయం రూ.4.87 లక్షలు

బొంరాస్‌పేట, మార్చి 4 : మండలంలోని పోలేపల్లిలో గత నెల 29వ తేదీ నుంచి ఈ నెల 4వ తేదీ వరకు ఐదు రోజులపాటు నిర్వహించిన ఎల్లమ్మ జాతర హుండీని సోమ వారం దేవాలయ ప్రాంగణంలో లెక్కించారు. హుండీ ద్వారా ఈ ఏడాది రూ.4,87,607ల ఆదాయం వచ్చింది. ఇది గత ఏడాది కంటే రూ.68,817లు అధికం. 571 గ్రాముల వెండిని భక్తులు సమర్పిం చుకున్నారు. హుండీ లెక్కింపులో దేవస్థాన ఛైర్మన్ జయరాములు, దేవా దాయ శాఖ ఈవో బాల్‌రాజ్, దేవాలయ మేనేజర్ రాజేందర్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. కాగా ఐదు రోజులపాటు నిర్వహించిన ఎల్లమ్మ ఉత్సవాలు సోమవారం ముగిశాయి. సోమవారం అమ్మవారికి దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి పొద్దుపోయిన తరువాత అమ్మవారిని గ్రామంలోని దేవాలయానికి ఊరేగింపుగా పల్లకీలో తరలించడంతో ఉత్సవాలు ముగిశాయి. సోమవారం కూడా భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు.

సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తున్నాం

లబ్ధిదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ కె.కిషన్, డిప్యూటీ తహసీల్దార్ మహేశ్

పెద్దేముల్, మార్చి 4 : ధరణిలో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా లబ్ధిదారుల సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తున్నామని తహసీల్దార్ కిషన్ అన్నారు. సోమవారం కార్యక్రమంలో భాగంగా బండమీదిపల్లి, తట్టేపల్లి, పాషాపూర్ గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో లబ్ధిదారులను పిలిపించుకొని వారి దరఖాస్తులను పరిశీలించి పరిష్కరిస్తున్నామన్నారు. రైతులు, పట్టాదారుల భూములకు సంబంధించిన రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు ధరణి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. మండలంలో మొత్తం 599 ధరణి సమస్యలు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. రెవెన్యూ సిబ్బందిని రెండు బృందాలుగా ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మహేశ్, ఆర్ఐ రాజురెడ్డి, సీనియర్ అసిస్టెంట్ వేణు, జూనియర్ అసిస్టెంట్లు అవినాశ్, రమేశ్ పాల్గొన్నారు.

5.3 ఎకరాల ఎఫ్‌టీఎల్ సేఫ్

సిటీబ్యూరో, మార్చి 4 (నమస్తే తెలంగాణ) : శేరిలింగంపల్లి మండలం గోపన్‌పల్లి ఎడ్లవానికుంట ఆక్రమణకు జీహెచ్ఎంసీ అడ్డుకట్ట వేసింది. 5.3 ఎకరాల ఎఫ్‌టీఎల్ విస్తీర్ణంలో ఉన్న చెరువు స్థలాన్ని కొందరు పట్టేదారులు ఆక్రమించేందుకు ప్రయత్నించారు. న్యాయస్థానాన్ని ఆశ్రయించి, కోర్టు ఆదేశాలను ఆసరా చేసుకొని చెరువును ఆక్రమించేందుకు కట్టను తెగకొట్టారు. దీంతో పాటు చెరువులో బండరాళ్ల డంపింగ్ చర్యలు చేపట్టారు. దీనిపై స్పందించిన జీహెచ్ఎంసీ లేక్ విభాగం అధికారులు.. బండరాళ్లను తొలగించి.. అన్యాక్రాంతం కాకుండా కాపాడారు. సంబంధిత పట్టేదారులపై గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో గతేడాది జూలై 5న ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. సర్వే నంబర్ 71/1, 71/2 సంబంధించిన పట్టదారులు ట్యాంక్(చెరువు)బెడ్‌లోని భూమి తన ఆస్తి అంటూ పేర్కొంటూ.. హైకోర్టు ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో సంబంధిత పట్టేదారులు ప్రకాశ్, రాజు ఎడ్లవానికుంట ప్రభుత్వ ఆస్తిని దెబ్బ తీసినందుకు జిల్లా కలెక్టర్‌కు జీహెచ్ఎంసీ అధికారులు నివేదిక అందించారు. కలెక్టర్ వారికి నోటీస్ జారీ చేశారు. వివిధ కార్పొరేట్ కంపెనీలు జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న సరస్సుల పునరుజ్జీవనం, అభివృద్ధికి సీఎస్ఆర్ ప్రోగ్రాం కింద దత్తత తీసుకునేందుకు ముందుకొస్తున్నాయి. పెద్ద చెరువు గంగారం, పటేల్ చెరువు, గోపి చెరువు, గోపన్‌పల్లి ట్యాంకుల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇటీవల జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ సీఎస్ఆర్ పనులను పరిశీలించారు. అభివృద్ధిని సరైన రీతిలో నిర్ధారించడానికి అన్ని సీఎస్ఆర్ సరస్సులను క్షేత్రస్థాయిలో పరిశీలించి..అవసరమైన సూచనలు జారీ చేస్తున్నారు.

ఉపాధ్యాయురాలితో అసభ్యంగా ప్రవర్తించిన..

పాఠశాల ఇన్‌చార్జిపై కేసు నమోదు

మన్సూరాబాద్, మార్చి 4: ఉపాధ్యాయురాలితో అసభ్యంగా ప్రవర్తిస్తూ.. వేధింపులకు పాల్పడుతున్న ఓ ప్రైవేట్ పాఠశాల ఇన్‌చార్జిపై ఎల్బీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఎల్బీనగర్, శివగంగకాలనీలోని ఓ ప్రైవేట్ హైస్కూల్లో ఓ మహిళ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నది. పాఠశాల ఇన్‌చార్జిగా ఉన్న నాగరాజు కొంత కాలంగా ఆమెను మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నాడు.

నాగరాజు ఆదివారం రోజున ఆ మహిళా ఫ్యాకల్టీని తన క్యాబిన్‌లోకి పిలిచి.. అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె ఎల్బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఉపాధ్యాయురాలి ఫిర్యాదు మేరకు ఎల్బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థులకు ప్రశంసా పత్రాలు

కులకచర్ల, మార్చి 4 : శిక్షణా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం పుట్టపహాడ్ కాంప్లెక్స్ పరిధి లో నిర్వహించిన క్విజ్ పోటీల్లో అంతారం ప్రాథమిక కోన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభను కనబర్చడంతో వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. కాంప్లెక్స్ స్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబర్చడం అభినందనీయమని అం తారం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు హన్మంతు తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఉపాధ్యాయులు, శిక్షణాఫౌండేషన్ నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

సమీక్షిస్తున్న డీసీ వేణుగోపాల్‌రెడ్డి, చిత్రంలో డీసీ వంశీకృష్ణ

మియాపూర్, మార్చి 4 : క్షేత్రస్థాయిలో పరిశుభ్రమైన పరిసరాలను నెలకొల్పటమే లక్ష్యంగా సిబ్బంది పని చేయాలని శేరిలింగంపల్లి జోనల్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ డీసీ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. చెత్త కుప్పల్లేని వీధులను ఆవిష్కరించాలంటే విధుల నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యం పనికిరాదన్నారు. చందానగర్ సర్కిల్ పరిధిలో పారిశుధ్య పరిస్థితులపై డీసీ వంశీకృష్ణ, వైద్యాధికారి కార్తిక్, ఎస్ఎస్ శ్రీనివాస్, ఎస్ఆర్‌పీలు, ఎస్ఎఫ్ఏలతో సర్కిల్ కార్యాలయంలో డీసీ సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. సకాలంలో విధులకు హాజరుకావాలని, తమకు కేటాయించిన ప్రాంతంలో అత్యంత పకడ్బందీగా పారిశుధ్య పనులను చేపట్టాలని, ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని పేర్కొన్నారు. విధులలో ఉండి మరణించిన, 60 ఏండ్లు పై బడిన వారి వివరాలను సేకరించాలని, వారి స్థానంలో కొత్త వారి నియామకానికి ఉన్నతాధికారులకు నివేదించాల్సి ఉందని తెలిపారు. స్వచ్ఛ ఆటోలతో పాటు క్షేత్రస్థాయి సిబ్బంది పని తీరుపై తగు పర్యవేక్షణ చేపట్టాలని, పురోగతిని నివేదించాలని సూచించారు. విధుల నిర్వహణ ప రంగా నిర్ధారిత సమయాలలో విధిగా క్షేత్రస్థాయిలోనే ఉండాలని స్పష్టం చేశారు.

కల్వర్ట్ నిర్మాణ పనుల పరిశీలన

కొండాపూర్, మార్చి 4 : చందానగర్ – అమీన్‌పూర్ రోడ్డు విస్తరణలో భాగంగా కైలాశ్‌నగర్ సమీపంలో చేపట్టిన కల్వర్ట్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని చందానగర్ కార్పొరేటర్ మంజుల రఘునాథరెడ్డి అన్నారు. సోమవారం ఆమె అధికారులతో కలిసి కల్వర్ట్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. చందానగర్ – అమీన్‌పూర్ రోడ్డు విస్తరణలో భాగంగా రూ.1.25కోట్లతో చేపట్టిన కల్వర్ట్ నిర్మాణాన్ని త్వరితగతిన, నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ పూర్తి చేయాలన్నారు. వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా సూచిక బోర్డులను ఏర్పాటు చేయాల్సిందిగా సూచించారు. కల్వర్ట్‌ల నిర్మాణ పనులు పూర్తైన వెంటనే రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, చందానగర్ డివిజన్ అధ్యక్షులు రఘునాథ రెడ్డి పాల్గొన్నారు.

ప్రొఫెసర్లకు ఉత్తమ ప్రతిభ అవార్డులు

అవార్డులను అందజేస్తున్న దృశ్యం

బడంగ్‌పేట, మార్చి 4: ఇంజినీరింగ్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన నాదర్‌గుల్ ఎంవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్లకు ఏఐఎంఈఆర్ఎస్ ఔట్రిచ్ అవార్డులను అందజేశారు. నగరంలోని సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో అవార్డులతోపాటు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి జనగామ ఎమ్మెల్యే పల్లారాజేశ్వర్‌రెడ్డి, డాక్టర్ బీఎల్ దీక్షితులు, మల్లారెడ్డి వర్సిటీ వీసీ వీఎస్‌కే రెడ్డి హాజరయ్యారు. ప్రిన్సిపాల్ కనకదుర్గ, డాక్టర్ వేణుగోపాలరావు, జీవితకాల సాఫల్య అవార్డుకు ఎంపికవగా, ప్రొఫెసర్ జయశ్రీ హన్మంతరావు స్టూడెంట్ మెంటార్‌షిప్ డెవలప్‌మెంట్ అవార్డుకు ఎంపికయారు. కార్యక్రమంలో ఎంవీఎస్ఆర్ కళాశాల చైర్మన్ పీవీఆర్ కశ్యప్, కృష్ణకుమార్, మూర్తి, హెచ్‌వోడీ ప్రసన్నకుమార్ తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ జగిని ఆదిత్య

ఆర్కేపురం, మార్చి 4: ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర మహిళా విభాగ్ ఆధ్వర్యంలో సోమవారం పీబీఆర్ కన్వెన్షన్ హాల్‌లో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాదాపూర్‌లోని జగినిస్ ఓలివ్స్ డెంటల్ వరల్డ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వెయ్యికి పైగా మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సలహాలు, సూచనలు చేశారు. డాక్టర్ జగిని ఆదిత్య మాట్లాడుతూ.. తన కుటుంబ సభ్యుల ఆలోచనలు, ప్రోత్సాహంతో సేవా కార్యక్రమాలు చేస్తున్నారని తెలిపారు. ఇటీవల జగిని ఓలివ్స్ డెంటల్ వరల్డ్‌ను ప్రారంభించామని, ఒక ఏడాది పాటు ఉచిత కన్సల్టెన్సీ ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఔటర్‌పై హిట్ అండ్ రన్

ఆర్మీ జవాన్ దుర్మరణం

ఢీకొట్టి పరారైన కారు డ్రైవర్

సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు

మణికొండ, మార్చి 4: హిట్ అండ్ రన్..నార్సింగి ఔటర్ రింగ్ రోడ్డుపై వేగంగా దూసుకొచ్చిన కారు..ఆర్మీ జవాన్‌ను ఢీకొట్టి వెళ్లిపోయింది. గాయపడిన జవాన్ అక్కడికక్కడే మృతిచెందాడు. సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటన సోమవారం నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రాందేవ్‌గూడ ఆర్టిలరీ సెంటర్‌లో జవాన్‌గా విధులు నిర్వహిస్తున్న కులాన్(34) నార్సింగి సమీపంలోని ఔటర్ రింగ్ రోడ్డును దాటుతుండగా, గచ్చిబౌలి నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వెళ్తున్న కారు ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో కులాన్ దుర్మరణం చెందాడు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని.. ఐడెంటి కార్డు ఆధారంగా మృతుడు జవాన్ కులాన్‌గా గుర్తించారు. ఘటనకు కారణమైన కారును గుర్తించేందుకు పోలీసులు ఆ మార్గంలో ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. ఇదిలా ఉండగా..రోడ్డు ప్రమాదంలో చనిపోయిన ఆర్మీ జవాన్ కులాన్ విధి నిర్వహణలో భాగంగా అక్కడికి వచ్చాడా..ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా.. అన్న కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నారు.

భార్యను హత్య చేసిన భర్త

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 4: భార్యపై అనుమానం పెంచుకున్న ఓ భర్త.. అతికిరాతకంగా ఆమెను హత్య చేశాడు. ఈ ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ పి.మధు కథనం ప్రకారం.. హయాత్‌నగర్‌కు చెందిన అమృత్ లాల్ సాహూ(43), మధుబాయి(29) దంపతులు. వీరికి ఒక పాప. బతుకు దెరువు కోసం శాస్త్రీపురం ప్రాంతానికి వలస వచ్చి జీవిస్తున్నారు. అమృత్ లాల్ సాహూ మేస్త్రీగా పని చేస్తున్నాడు. మధుబాయి కూలీగా పని చేస్తున్నది. అమృత్ లాల్ సాహూ కొంత కాలంగా భార్యపై అనుమానం పెంచుకున్నాడు. ఎవరితో మాట్లాడినా గొడవ పడేవాడు. ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగాయి. ఈ క్రమంలో ఆదివారం రాత్రి కూడా వీరిద్దరి మధ్య గొడవ జరిగింది. అనంతరం మధుబాయి నిద్రపోయిన తరువాత.. బయట నుంచి బండరాయిని తీసుకొచ్చి ఆమె తలపై వేసి హత్య చేశాడు. రక్తం మడుగులో పడి ఉన్న మధుబాయిని చూసిన స్థానికులు.. పోలీసులకు సమాచారమిచ్చారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

బహిరంగ ప్రకటన

తేది: 04-03-2024

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, శ్రీ మద్దూరి మనోహర్ తండ్రి మద్దూరి వెంకటయ్య, అమీర్‌పేట్ గ్రామం, మహేశ్వరం మండలం, రంగారెడ్డి జిల్లా వాస్తవ్యులు స్వార్జితం కింద సంపాదించిన ఆస్తిని తనఖా పెట్టుకొని శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్ షాద్‌నగర్ బ్రాంచి వారు లోన్ ఇవ్వడానికి నిశ్చయించినారు. కావున ఎవరికైన ఆక్షేపణలు గాని అభ్యంతరాలు గాని ఉన్న యెడల (3) మూడు రోజుల లోపు సంప్రదించగలరు. లేనిచో ఈ ఆస్తి ఎటువంటి వివాదాలు లేనిదిగా పరిగణించి మా క్లయింటు ముందుకు సాగుతారు.

ఆస్తి వివరాలు :- ఘంట్లవెల్లి గ్రామం, ఫరూఖ్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా పరిధిలో గల సర్వే నెం.163/UU/2 లోని 121 చదరపు గజముల ప్లాటు కలదు.

హద్దులు :- ఉత్తరం : రూప్లా యొక్క భూమి, **దక్షిణం :** 33'-00" వెడల్పు రోడ్డు, **తూర్పు :** రాజేందర్ యొక్క ప్లాటు, **పడమర :** షైక్ రష్మాన్ యొక్క ప్లాటు.

బి.రాజశేఖర్ రాజు, అడ్వకేట్
ఇం.నెం. 12-24, నెహ్రూ కాలనీ, షాద్‌నగర్, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం. సెల్: 9849415189

బహిరంగ ప్రకటన

తేది: 04-03-2024

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, శ్రీ షేక్ రష్మాన్ తండ్రి షేక్ యాసిన్, జహనుమా చార్మినార్, హైదరాబాద్ వాస్తవ్యులు స్వార్జితం కింద సంపాదించిన ఆస్తిని తనఖా పెట్టుకొని శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్ షాద్‌నగర్ బ్రాంచి వారు లోన్ ఇవ్వడానికి నిశ్చయించినారు. కావున ఎవరికైన ఆక్షేపణలు గాని అభ్యంతరాలు గాని ఉన్న యెడల (3) మూడు రోజుల లోపు సంప్రదించగలరు. లేనిచో ఈ ఆస్తి ఎటువంటి వివాదాలు లేనిదిగా పరిగణించి మా క్లయింటు ముందుకు సాగుతారు.

ఆస్తి వివరాలు :- ఘంట్లవెల్లి గ్రామం, ఫరూఖ్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా పరిధిలో గల సర్వే నెం.163/UU/2 లోని 121 చదరపు గజముల ప్లాటు కలదు.

హద్దులు :- ఉత్తరం : రూప్లా యొక్క భూమి, **దక్షిణం :** 33'-00" వెడల్పు రోడ్డు, **తూర్పు :** మనోహర్ యొక్క ప్లాటు, **పడమర :** రాందాస్ యొక్క ప్లాటు

బి.రాజశేఖర్ రాజు, అడ్వకేట్
ఇం.నెం. 12-24, నెహ్రూ కాలనీ, షాద్‌నగర్, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం. సెల్: 9849415189

బహిరంగ ప్రకటన

ఇందు మూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్ తెలంగాణ వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట్ మండలం, గుబ్బడి ఫతేపూర్ గ్రామ పరిధిలోని సర్వే నెం.90/4లో గల 0.20 గుంటలు మరియు సర్వే నెం. 90/1/1/1/1లో గల 0.02 గుంటలు వ్యవసాయ భూమి కొనుగోలు చేయుటకు ఆ భూమి యాజమాని అయిన శ్రీ సయ్యద్ అలీం తండ్రి సజ్జాద్, గుబ్బడి ఫతేపూర్, నవాబ్‌పేట్ తో లావాదేవీలు జరుపుచున్నారు. సర్వే నెం. 90/4లో గల 0.20 గుంటలు సదరు శ్రీ సయ్యద్ అలీం తండ్రి సజ్జాద్ అనే అతను నవాబ్‌పేట్ మండలం, గుబ్బడి ఫతేపూర్ గ్రామానికి చెందిన శ్రీ రోషన్ అలీ గారి కొడుకు శ్రీ జాంగీరు సాబు నుండి విక్రయ దస్తావేజు ద్వారా కొనుగోలు చేయడం జరిగినది మరియు సర్వే నెం. 90/1/1/1/1 లో గల 0.02 గుంటలు నవాబ్‌పేట్ మండలం, గుబ్బడి ఫతేపూర్ గ్రామానికి చెందిన శ్రీ జంగయ్య గారి కుమారుడు శ్రీ బేగరి చిన్న బాలయ్య నుండి విక్రయ దస్తావేజు ద్వారా కొనుగోలు చేసిన ఒక ఎకరం వ్యవసాయం భూమికి చెందిన మిగులు 0.02 గుంటల భూమి. **షెడ్యూల్ భూమి:** తెలంగాణ రాష్ట్రం వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట్ మండలం, గుబ్బడి ఫతేపూర్ గ్రామం పరిధిలోని సర్వే నెం.90/4లో గల 0.20 గుంటలుకు హద్దులు. **ఉత్తరం:** ఇతరుల భూమి, **దక్షిణం:** రోడ్డు, **తూర్పు:** తాహెర్ మీయా ఇతరులు, **పడమర:** సయ్యద్ అలీం మరియు వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట్ మండలం, గుబ్బడి ఫతేపూర్ గ్రామం పరిధిలోని సర్వే నెం. 90/1/1/1/1లో గల 0.02 గుంటలు హద్దులు: **ఉత్తరం:** ఇతరుల భూమి, **దక్షిణం:** రోడ్డు, **తూర్పు:** సయ్యద్ అలీం, **పడమర:** గోలిపల్లి సంజీవ్. సదరు వ్యవసాయ భూమికి సంబంధించి ఎవరైన వ్యక్తి లేదా వ్యక్తులు ఈ భూమిపైన ఏదైనా క్లయిమ్/ఆక్షేపణ కలిగి ఉన్నచో వారు ఈ ప్రకటన తేది నుండి పది (10) దినముల లోపల తగిన సాక్ష్యాధారాలతో వ్రాత పూర్వకముగా ఈ దిగువ సంతకందారుకు తెలియజేయగలరు లేనిచో నా క్లయింట్ పైన తెలిపిన యాజమానితో SALE DEED పూర్తి చేసుకొనుటకు ముందుకు సాగుతారు గడువు తదుపరి వచ్చే ఎట్టి క్లెయిములు/ఆక్షేపణలు/వివాదాలు/అభ్యంతరములు అంగీకరించబడవు.

సం/- విజయ భాస్కర్, న్యాయవాది
ఫ్లాట్ నెం. 301, లార్సన్స్ అపార్ట్‌మెంట్
ఆంజనేయనగర్, మూసాపేట్, హైదరాబాద్–18
సెల్ నెం. 9502141578
తేది: 05-03-2024